పరిహారం అందక.. అభివృద్ధికి నోచుకోక

- తాండవ మల్లేశ్వర స్వామి మాన్యం భూములు చెరువులో మునక
- అధికారుల నిర్లక్ష్యంతో 20 ఏళ్లయినా అందని పరిహారం
- అభివృద్ధికి నోచుకోక శిథిలావస్థలో ఆలయం


శిథిలావస్థకు చేరిన కొత్తపల్లి శ్రీతాండవ మల్లేశ్వరస్వామి ఆలయం

కొత్తపల్లి: మూడు పువ్వులు, ఆరు కాయలుగా వెలుగొందిన దేవాలయం అధికారుల నిర్లక్ష్యం కారణంగా నేడు శిథిలావస్థకు చేరింది. 20 ఏళ్ల క్రితం ఆలయ భూములు చెరువులో మునకకు గురికాగా.. రికార్డులు క్రమబద్ధీకరించకపోవడం, సంబంధింత అధికారులు పట్టించుకోకపోవడంతో లక్షలాది రూపాయల పరిహారం నేటి వరకూ అందలేదు. దీంతో శతాబ్దాల చరిత్ర కలిగిన ఆలయం అభివృద్ధికి నోచుకోక శిథిలావస్థకు చేరింది.

ఆలయానికి 7.40 ఎకరాల భూమి

రాజులు, భూ స్వాములు కట్టించిన దేవాలయాల ఆలనా, పాలనా కోసం వందల ఎకరాల భూములను కేటాయించారు. ఈ నేపథ్యంలోనే కొత్తపల్లి మండల కేంద్రంలో ఉన్న తాండవ మల్లేశ్వర స్వామి దేవాలయానికి సర్వే నంబర్ 638లో 1.76 ఎకరాలు, సర్వే నంబరు 639లో 5.64 ఎకరాల చొప్పున మొత్తం 7.40ఎకరాల భూమి ఉంది. మండలంలోని గోకవరం గ్రామానికి చెందిన ప్రముఖ నేతి మిఠాయిల వ్యవస్థాపకులు జి.పుల్లారెడ్డి తమ స్వగ్రామమైన గోకవరం గ్రామ ప్రజలకు తాగు, సాగునీటిని అందించేందుకు ప్రత్యేకంగా చెరువు నిర్మాణం చేపట్టేందుకు 2004లో రైతుల నుంచి భూమిని కొనుగోలు చేశారు. చెరువు నిర్మాణం చేపట్టేందుకు భూమిని రిజిస్ట్రేషన్ కూడా చేయించారు. ఈ చెరువు నిర్మాణం కోసం ప్రభుత్వం అప్పటి ప్రభుత్వం కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేసింది. అయితే చెరువు నిర్మాణంలో తాండవ మల్లేశ్వర స్వామి భూమి కూడా మునకకు గురైంది. దీంతో ఆలయానికి సుమారు రూ.40 లక్షల వరకు పరిహారం రావాల్సి ఉంది.

బాధ్యత మరిచిన అధికారులు

రైతులు, ఆలయాలకు చెందిన భూములను ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ప్రభుత్వం తీసుకున్నప్పుడు వాటికి సంబంధించిన నష్ట పరిహారాన్ని దేవదాయ శాఖకు చెల్లిస్తుంది. అయితే ఇందుకు సంబంధించిన రికార్డులను ఎప్పటికప్పుడు క్రమబద్ధీకరించాల్సిన అధికారులు నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించడం, ఇతర శాఖల అధికారులతో సమన్వయం కాకపోవడంతో 20 ఏళ్లయినా పరిహారం అందలేదు. బాధ్యతగా వ్యవహరించాల్సిన అధికారులు రావలసిన పరిహారం తెచ్చుకోలేకపోవడంతో వందల సంవత్సరాల చరిత్రక లిగిన దేవాలయం శిథిలావస్థకు చేరుకుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రతి ఏటా తిరునాల

మండల కేంద్రంలో ప్రతి ఏటా జనవరి నెలలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని అంగరంగ వైభవంగా జరిగే తాండవమల్లేశ్వర స్వామి వారి తిరునాళ్లను చూసేందుకు గ్రామస్తులే కాక వివిధ ప్రాంతాల ప్రజలు కూడా వస్తుంటారు. స్వామి వారి తిరునాల వారం రోజుల పాటు జరుగుతుంది. ఆలయానికి ఇతర ప్రాతంలో ఉన్న మాన్యం భూముతో వచ్చే ఆదాయంతో పాటు గ్రామపెద్దలు చందాలు వేసుకొని తిరునాల నిర్వహిస్తున్నారు. అయితే కూలేందుకు సిద్ధంగా ఉన్న తాండవ మల్లేశ్వర స్వామి ఆలయాన్ని జీర్ణోద్ధరణ చేసి పునర్నిం చేందుకు ఏవరొస్తారోనని గ్రామస్తులు ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి భూములకు పరిహారమందేలా చేసి ఆలయాన్ని అభివృద్ధి చేయాలని భక్తులు, గ్రామస్తులు కోరుతున్నారు.

ఆలయం ఎప్పుడు కూలుతుందో తెలియదు



తాండవ మల్లేశ్వస్వామి ఆలయం వందల ఏళ్లనాటిది. ఈ ఆలయంలో ద్వాపర యుగంలో పాండవులు అరణ్యవాస కాలంలో ఈశ్వరుడికి పూజలు నిర్వహించేవారని మా పెద్దలు చెప్పారు. ఆ తర్వాత కలియుగంలో చోళభూపాల మహారాజు పండితుల ద్వారా పూర్వం ఈ ప్రాంతంలో మహాదేవుడు తాండవం చేశాడని తెలుసుకుని 500 సంవత్సరాలకు ముందు అప్పట్లో నిలువు బండలతో ఆలయాన్ని నిర్మించారు. ఆ తర్వాత కాలక్రమేణా ఆలయం అభివృద్ధి అంతంతమాత్రమే జరిగింది. ప్రస్తుతం ఆలయం పూర్తిగా శిథిలావస్థకు చేసుకుంది. పట్టించుకునే నాథుడు కరువయ్యారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ ఆలయాన్ని అభివృద్ధి దిశలో నడిపించాలి.

– ఏళ్ల బాల సుబ్బారెడ్డి, కొత్తపల్లి

నష్టపరిహారం తెప్పించేందుకు చర్యలు



ఆలయానికి చెందిన భూములు జి.పుల్లారెడ్డి చెరువు నిర్మాణంలో పోయాయి. అయితే వాటికి ఇంతవరకు ఎటువంటి నష్ట పరిహారం రాలేదు. అందుకోసం అన్ని ధ్రువపత్రాలతో పుల్లారెడ్డి ట్రస్ట్ సభ్యులతో చర్చించాం. వారు సానుకూలంగా స్పందించారు. త్వరలోనే కోల్పోయిన దేవాదాయ భూములకు నష్టపరిహారం ఇచ్చేందుకు సుముఖత తెలిపారు. అంతే కాకుండా జిల్లా డిప్యూటీ కలెక్టర్ దృష్టికి కూడా ఈ సమస్యను తీసుకెళ్లాం. త్వరలోనే భూములకు చెందిన నష్ట పరిహారం అందేలా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు.

–కార్తీక్, తాండవమల్లేశ్వరస్వామి ఆలయం ఈఓ

క్లుప్తంగా

పిల్లలను బడికి పంపాలి


సున్నిపెంట బస్టాండ్‌లో విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు.

శ్రీశైలంప్రాజెక్ట్: నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా శనివారం సున్నిపెంట గ్రామంలో ఉన్నతపాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను బడికి పంపాలని, చదువులు మాన్పించి కూలీలుగా మార్చవద్దని నినాదాలు చేశారు. ర్యాలీలో ఎంఈఓ శత్రునాయక్, హెడ్‌మాస్టర్ ఈశ్వరమ్మబాయి, టీచర్లు పాల్గొన్నారు.

హాస్టల్‌కు స్థలాన్ని కేటాయించాలి


అధికారులతో సమావేశమైన ఎంఈఓ బాలాజీ

ఆత్మకూరు: మండలంలోని బైర్లూటి గూడెంలో నిర్మించబోయే హాస్టల్‌కు స్థలాన్ని కేటాయించాని ఎంఈఓ బాలాజీ కోరారు. ఈ మేరకు శనివారం డీఎఫ్ఓ సాయిబాబాకు వినతి పత్రం అందజేశారు. అలాగే మండల రెవెన్యూ అధికారిని కలిసి మండలంలోని కురుకుందగ్రామంలో పీవీటీజీ హాస్టల్ నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని ఎలేనేషన్ చేయాలని కోరారు. బైర్లూటీ చెంచుగూడెం ఫారెస్ట్ ఏరియాలో ఉండడంతో గ్రామసభ తీర్మానం ద్వారా కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. సీఆర్‌పీల సాయంతో గ్రామసభ తీర్మానం పొంది, స్కెచ్ తయారు చేయడానికి విజిట్ చేయడం జరుగుతుందని ఎంఈఓ తెలిపారు.

శునకాలకు వ్యాక్సిన్


పాములపాడులో కుక్కకు వ్యాక్సిన్ వేస్తున్న వైద్య సిబ్బంది

పాములపాడు: మండలంలోని పాములపాడు, వేంపెంట వెటర్నరీ డిస్పెన్సరీల్లో శనివారం జూనోసిస్ దినోత్సవం సందర్భంగా శునకాలకు డాక్టర్లు అనిల్, భాస్కర్ లు వ్యాక్సిన్లు వేశారు. వారు మాట్లాడుతూ పెంపుడు కుక్కలకు తప్పని సరిగా వ్యాక్సిన్ వేయించాలన్నారు. పశువుల నుంచి మనుషులకు వచ్చే రేబిస్, బ్రూసెల్లోసిస్, ఆంత్రాక్స్, జపనీస్ ఎన్సెఫలైటీస్, అమీబియాసిస్ వంటి వ్యాధులు, వాటి నివారణ గురించి ప్రజలకు వివరించారు. పాములపాడులో 20 కుక్కలకు వ్యాక్సిన్ వేశారు. కార్యక్రమాల్లో వేంపెంట పశువైద్యశాల సిబ్బంది ప్రసన్న, చాందిని, కరిముల్లా, పాములపాడు సిబ్బంది స్వాతి, నాగేశ్వరావు, కవిత తదితరులు పాల్గొన్నారు.

బాబూ జగ్జీవన్‌రామ్ సేవలు మరవలేనివి


బాబూ జగ్జీవన్‌రామ్ చిత్ర పటానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

నందికొట్కూరు: మాజీ ఉపప్రధానమంత్రి బాబూ జగ్జీవన్‌రామ్ దేశానికి అందించిన సేవలు మరవలేనివని ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. శనివారం అల్లూరు గ్రామంలో మాంద్ర శివానందరెడ్డి స్వగృహంలో బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ బాబు జగ్జీవన్‌రామ్ జీవితం స్ఫూర్తిదాయకమన్నారు. బీహార్ రాష్ట్రం నుంచి వెనబడిన వర్గాల నుంచి స్వాతంత్ర సమరయోధుడని చెప్పారు. సామాజిక న్యాయం కోసం కృషి చేసిన వ్యక్తిగా చరిత్రలో నిలిచారని తెలిపారు.కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాజు, బాలస్వామి, తదితరులు పాల్గొన్నారు.

శ్రావణ మాసంలో భజనకు అవకాశం కల్పించండి


దేవస్థాన ఈఓకు వినతి పత్రం అందజేస్తున్న కర్నూలు మాజీ మేయర్ బంగి అనంతయ్య

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయంలో శ్రావణ మాసంలో భజన చేసేందుకు అవకాశం కల్పించాలని కర్నూలు మాజీ మేయర్ బంగి అనంతయ్య కోరారు. ఈ మేరకు శనివారం దేవస్థాన పరిపాలన భవనంలో ఈఓ ఛాంబర్‌లో ఈఓ పెద్దిరాజును కలిసి వినతి పత్రం అందజేశారు. బంగి అనంతయ్య మాట్లాడుతూ కర్నూలుకు చెందిన శ్రీ చెన్నకేశవ నాటక కళా భజన మండలి తరఫున 1968వ సంవత్సరం నుంచి శ్రావణ మాసంలో శ్రీశైల ఆలయంలో భజన చేస్తున్నామని, ఈ శ్రావణ మాసంలో కూడా అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.

8న వైఎస్సార్ జయంతి

ఆత్మకూరు: పట్టణంలో ఈనెల 8వ తేదీన దివంగత మహానేత, మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 75వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ ఆత్మకూరు పట్టణ, మండల అధ్యక్షులు ఎస్ఎస్ సయ్యద్‌మీర్, డి.రాజగోపాల్ రెడ్డి తెలిపారు. శనివారం వారు స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ 8వ తేదీన ఉదయం 9 గంటలకు పార్టీ కార్యాలయానికి అందరూ చేరుకోవాలన్నారు. అనంతరం బైకు ర్యాలీగా వెళ్లి నంద్యాల టర్నింగ్‌లోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తామన్నారు. అక్కడి నుంచి నల్లకాల్వలోని స్మృతివనం వరకు బైకు ర్యాలీ చేపడుతున్నట్లు చెప్పారు. వైఎస్సార్ జయంతి వేడుకలకు ఎంపీటీసీలు, సర్పంచులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.

మహానందిలో వీకెండ్ సందడి


మహానందీశ్వర స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

మహానంది: మహానందిలో శనివారం వీకెండ్ సందడి నెలకొంది. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తులు 3 కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ కామేశ్వరి దేవి, మహానందీశ్వర స్వామివారిని దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. ఉదయం నుంచి రాత్రి వరకూ ఆలయ ప్రాంగణంలో భక్తుల రద్దీ కొనసాగింది.

సమస్యాత్మకంగా 80 బన్నూరు శ్మశానవాటిక


పాత శ్మశాన వాటిక స్థలాన్ని సర్వే చేసేందుకు వచ్చిన అధికారులను అడ్డుకున్న గ్రామస్తులు

జూపాడుబంగ్లా: మండలంలోని 80బన్నూరు గ్రామంలో దళితుల శ్మశానవాటికకు స్థలం కేటాయింపు సమస్యాత్మకంగా మారింది. దళితులకు చెందిన శ్మశానవాటిక స్థలం నేషనల్‌హైవే రోడ్డు నిర్మాణంలో పోవడంతో అధికారులు మరో స్థలాన్ని కేటాయించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అందులో భాగంగా శనివారం గ్రామ సర్వేయర్, రెవెన్యూ అధికారులు హైవే రోడ్డు నిర్మాణంలో పోయిన పాతశ్మశానవాటిక స్థలాన్ని పరిశీలించి కొలతలు వేసేందుకు యత్నించగా గ్రామస్తులు అడ్డుకున్నారు. దీంతో అధికారులు స్థలాన్ని కొలతలు వేయకుండా వెనుదిరిగారు.

దెయ్యాలు వేదాలు వల్లించినట్లుంది

నందికొట్కూరు: ఎమ్మెల్యే జయసూర్య మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కాకరవాడ వెంకటస్వామి అన్నారు. శనివారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం నిర్వహించారు. బైరెడ్డి రాజశేఖరరెడ్డిపై అనిచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యేపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పవిత్రమైన రంజాన్ మాసంలో ముస్లిం మహిళను అవమానించారని చంద్రబాబుకు ఫిర్యాదు చేసి, వారినే ఎమ్మెల్యే పార్టీలో ఎలా చేర్చుకున్నారని ప్రశ్నించారు. పార్టీలోకి చేరికలు సర్వసాధారణమని, అందులో భాగంగానే బైరెడ్డి పలువురిని చేర్చుకున్నారని గుర్తు చేశారు. చేతకానితనాన్ని కప్పి పుచ్చుకునేందుకు బైరెడ్డిపై ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. ఎమ్మెల్యే తీరుపై సీఎం చంద్రబాబుకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. నంద్యాల పార్లమెంట్ సభ్యురాలిగా బైరెడ్డి శబరి గెలిస్తే మాండ్ర శివానందరెడ్డి పార్లమెంట్ ఇన్‌చార్జ్‌నని అంటూ ప్రచారం చేసుకోవడం సమంజసం కాదన్నారు. ఎన్నికల తర్వాత పార్లమెంట్ ఇన్‌చార్జ్‌లు రద్దయినట్లు సీఎం చెప్పారన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు అబ్దుల్ షుకూర్, శైలజ, ముజుబుర్ రహిమాన్, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

కించపరిచేలా మాట్లాడితే సహించం


పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న సర్పంచ్ పల్లె నిర్మలమ్మ

జూపాడుబంగ్లా: స్వార్థరాజకీయాల కోసం మహిళా సర్పంచ్ అనే గౌరవం లేకుండా కించపరిచేలా మాట్లాడితే సహించేదిలేదని పోతులపాడు సర్పంచ్ పల్లె నిర్మలమ్మ, ఆమె కుమారుడు శివానందరెడ్డి అన్నారు. శనివారం వారు జూపాడుబంగ్లా ఎంపీడీఓ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ తనను, తన కుమారున్ని కించపరిచేలా, తనప్రతిష్ఠకు భంగం కలిగేలా మాట్లాడిన తరిగోపుల గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు సొప్పకట్టల గిరీశ్వరరెడ్డిపై చట్టపరంగా తగినచర్యలు తీసుకోవాలని కోరుతూ జూపాడుబంగ్లా పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదుచేసినట్లు తెలిపారు. గ్రామంలో పక్షంరోజుల క్రితం అతిసారం వ్యాధి వ్యాపించగా నడిపి నాగన్న అనే వ్యక్తి మృతి చెందాడు. అతను గుండెపోటుతో మృతిచెందినట్లు నందికొట్కూరు వైద్యులు నిర్ధారిస్తూ ధ్రువీకరణపత్రం మంజూరు చేసినట్లు తెలిపారు. అయితే అతని మృతికి నేను, నాకుమారుడు కారణమని నిందలు మోపడం సరికాదన్నారు. రాజకీయ గుర్తింపు కోసం నోటికొచ్చినట్లు మాట్లాడటం తగదన్నారు. అలాగే గ్రామంలో తాగునీరు కలుషితం కాలేదని తాగునీటిశాఖ అధికారులు నిర్ధారించి రిపోర్టులు ఇచ్చారన్నారు. అవేవి తెలుసుకోకుండా నోటికొచ్చినట్లుగా మాట్లాడటం తగదన్నారు. పోతులపాడు గ్రామపంచాయతీ పరిధిలో ఇసుక రీచ్‌లు లేకపోయినా అక్రమంగా ఇసుక తవ్వకాలు ఎక్కడ జరిగాయో చేతనైతే చూపించాలన్నారు. అలాగే తెలంగాణ మద్యం విక్రయాలు ఎక్కడ జరిగాయో సాక్ష్యాధారాలతో చూపించాలన్నారు.

వైభవంగా మహానందీశ్వరుడి కల్యాణం


కల్యాణ పూజలు అందుకున్న మహానందీశ్వర దంపతులు

మహానంది: మహానందిలో కొలువైన శ్రీ గంగ, శ్రీ కామేశ్వరీ దేవి సహిత శ్రీ మహానందీశ్వర స్వామి వార్లకు నిత్య కల్యాణ సేవల్లో భాగంగా శనివారం స్థానిక యాగశాలలో కల్యాణోత్సవం కనుల పండువగా జరిగింది. వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర్ అవధాని, నాగేశ్వర శర్మ, ఆంజనేయ శర్మ, హనుమంతశర్మ, అర్చకులు ముందుగా స్వామి, అమ్మవార్లను వివిధ రకాల పుష్పాలు, ఆభరణాలతో అలంకరించారు. గణపతి పూజ, పుణ్యాహవాచనం, జీలకర్ర, బెల్లం సమర్పణ, మాంగళ్య ధారణ, అక్షింతల సమర్పణ పూజలను శాస్త్రోక్తంగా చేశారు.

అనుమతి ఉన్న ఎరువులు మాత్రమే విక్రయించాలి


గాజులపల్లె గఫారియా దుకాణంలో తనిఖీ చేస్తున్న దృశ్యం

మహానంది: అనుమతి ఉన్న ఎరువులు, పురుగు మందులు మాత్రమే విక్రయించాలని వ్యవసాయ శాఖ ప్రత్యేక తనిఖీ బందం సభ్యులు డీడీఏ సుబ్రహ్మణ్యం, విజిలెన్స్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. గాజులపల్లె గ్రామంలోని గఫారియా పెస్టిసైడ్స్ దుకాణాన్ని శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సరైన ధ్రువపత్రాలు చూపనందున రూ.34,619 విలువచేసే బయో ఉత్పత్తుల, స్టాక్ రిజిస్టర్లు నిర్వహణ సరిగా లేనందున రూ.3,24,199 విలువచేసే రసాయన మందుల అమ్మకాలను నిలుపుదల చేశారు. తనిఖీలో టెక్నికల్ ఏఓ కల్యాణ్ కుమార్, ఆయుబ్ బాషా, మహానంది ఏఓ నాగేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్ జయంతిని విజయవంతం చేయాలి

పగిడ్యాల: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి ఆదేశాల మేరకు ఈనెల 8న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించాలని మండల పార్టీ అధ్యక్షుడు పుల్యాల నాగిరెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా రెండు పర్యాయాలు విశేషసేవలు అందించిన మహానేత జయంతి వేడుకలను పండుగలా నిర్వహించాలన్నారు. వైఎస్సార్ విగ్రహాలకు పాలాభిషేకం నిర్వహించి, రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచులు, ఎంపీటీసీ, ఎంపీపీ, జెడ్పీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

'హంస' కార్యవర్గం ఎన్నిక

నందికొట్కూరు: పట్టణంలోని ఏపీ ఎన్‌జీఓ భవనంలో హంస నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. హంస జిల్లా అధ్యక్షుడు రఘుబాబు అధ్యక్షతన ఎన్నిక జరిగింది. తాలుకా అధ్యక్షుడిగా జగపతి, సహ అధ్యక్షుడిగా వహబ్, కార్యదర్శిగా చెంచన్న, కోశాధికారిగా అనురాగ్, ఉపాధ్యక్షులుగా జబీన్, పుష్పావతి, శివగౌరీ, ఆర్గనైజింగ్ సెక్రటరీ సల్మాన్, ఉమెన్ సెక్రటరీ నిర్మల జ్యోతి, జాయింట్ సెక్రటరీలు చంద్రనాయక్, శ్రీలత, రమాదేవి, పద్మావతి, ఈసీ మెంబర్లు చంద్రావతి, షంషాద్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ నూతన తాలుకా కమిటి ఉద్యోగుల సమస్యలపై నిరంతరం పోరాడాలన్నారు.

విరాళాన్ని వెనక్కి తీసుకున్న దేవస్థానం ఉద్యోగులు

మహానంది: మహానంది దేవస్థానం ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి బదిలీ కావడంతో దేవస్థానం ఉద్యోగులు గతంలో తాము తీసుకున్న నిర్ణయాన్ని మార్చుకున్నారు. కల్యాణ మండపం కోసం ఇచ్చిన విరాళాన్ని వెనక్కి తీసుకోవడం చర్చనీయాంశంగా మారింది. మహానంది దేవస్థానం ఉద్యోగులకు రావాల్సిన పీఆర్సీ మొత్తాన్ని గతంలో పని చేసిన ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి విడుదల చేశారు. ఉద్యోగులకు రూ. 56 లక్షలు చెల్లించారు. ఉద్యోగుల వేతనాన్ని బట్టి ఒక్కొక్కరికి రూ.రెండు లక్షల వరకు జమ అయ్యింది. అప్పట్లో దేవస్థానం ఉద్యోగుల సంఘం అందరూ కలిసికట్టుగా తమకు వచ్చిన పీఆర్సీ నుంచి సగం మొత్తం వెచ్చించి భక్తుల కోసం కల్యాణ మండపాన్ని నిర్మించేందుకు ఒప్పందం చేసుకున్నారు. నిర్మాణానికి స్థానిక ఉడిపి రమణ కల్యాణ మండపం వద్ద ఉన్న ఆలయ స్థలంలో భూమిపూజ చేశారు. అందులో భాగంగా ఉద్యోగుల సంఘం అకౌంట్లో రూ. 28 లక్షలు జమ చేశారు. అయితే ఈఓ బదిలీ కావడంతో నిర్ణయాన్ని మార్చుకున్న ఉద్యోగులు మా డబ్బులు మాకు చెల్లించాలని పట్టు పట్టడంతో ఎవరికి రావాల్సిన మొత్తాన్ని తిరిగి వారి ఖాతాల్లోకి బదిలీ చేయించుకోవడం చర్చనీయాంశంగా మారింది. యూనియన్ నిర్ణయాలకు కట్టుబడి ఉండడం అంటే ఇదేనా అంటూ కొందరు ఉద్యోగులు విమర్శలు చేస్తున్నారు.

రాజకీయ వేధింపులు ఆపాలి

ఆత్మకూరు: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు, స్కావెంజర్లపై రాజకీయ వేధింపులు ఆపాలని సీఐటీయూ పట్టణాధ్యక్షులు రజాక్, కార్యదర్శి రామ్‌నాయక్, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం నాయకురాలు ముబారక్ అన్నారు. వారికి పెండింగ్ వేతనాలు వెంటనే ఇచ్చి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం ఎంఈఓ సురేష్‌కి వినతి పత్రాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు అతి తక్కువ వేతనాలు ఇస్తున్నారని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు రూ.20 పెంచాలన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.10 వేలు వేతనం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన, స్కావెంజర్స్ కార్మికులు మల్లీశ్వరి, లక్ష్మీదేవి, ప్రభావతి, బిచ్చమ్మ, నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు కనీస వేతనం చెల్లించాలి

పగిడ్యాల: ఆశా వర్కర్లకు కనీస వేతనం చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కరరెడ్డి, మండల అధ్యక్షుడు రామకృష్ణ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి అనిల్‌కుమార్‌ను కలిసి ఈనెల 10న చేపట్టనున్న ధర్నాకు అనుమతివ్వాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఆశా వర్కర్లు సుజాత, రమణమ్మ, గిరిజా, విమలమ్మ, సరోజ, తదితరులు పాల్గొన్నారు.

పెంపుడు జంతువులతో అప్రమత్తంగా ఉండండి


కుక్కకు టీకా వేస్తున్న ఏడీ రామాంజనేయనాయక్

జూపాడుబంగ్లా: పెంపుడు జంతువుల పట్ల నిరంతరం అప్రమత్తంగా ఉంటూ వాటికి సరైన సమయంలో వ్యాక్సిన్లు వేయించాలని పశుసంవర్ధకశాఖ అసిస్టెంటు డైరెక్టర్ రామాంజనేయనాయక్ సూచించారు. శనివారం ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని పెంపుడు కుక్కలకు ఉచితంగా యాంటీ రేబీస్ వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఆయన మాట్లాడుతూ జులై 6న కుక్కకాటుకు గురైరేబీస్ వ్యాధి బారిన పడిన పిల్లవానికి లూయిస్ పాశ్చర్ అనే శాస్త్రవేత్త టీకామందు వేసి బతికించిన సందర్భాన్ని పురస్కరించుకొని జూనోసిస్ దినోత్సవంగా జరుపుకొంటారని తెలిపారు. పశుపక్షాదుల నుంచి మనుషులకు 180రకాల జూనోటిక్ జబ్బులు వ్యాపించే అవకాశాలున్నాయన్నారు. వాటిల్లో రేబీస్, అంత్రాక్స్, బ్రూసెల్లోసిస్, క్షయ మొదలైన ప్రాణాంతకమైన వ్యాధులున్నాయన్నారు. ఇందులో రేబీస్ వ్యాధి అత్యంత ప్రమాదకరమైందన్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

మల్లన్నను దర్శించుకున్న తెలంగాణ ఎమ్మెల్యేలు


ఆలయ ప్రాంగణంలో తెలంగాణ ఎమ్మెల్యేలు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఎమ్మెల్యేలు రాజేష్ రెడ్డి, వీర్లపల్లి శేఖర్, కసిరెడ్డి నారాయణ రెడ్డి, మేఘా రెడ్డి, సంపత్‌లు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. శనివారం మల్లన్న దర్శనార్థం ఆలయం వద్దకు విచ్చేసిన వారికి ఆలయ రాజగోపురం వద్ద దేవస్థాన అధికారులు, అర్చకస్వాములు, వేదపండితులు ఆలయ సంప్రదాయం ప్రకారంగా స్వాగతం పలికారు. తరువాత ఎమ్మెల్యేలు శ్రీస్వామివారికి అభిషేకాన్ని, అమ్మవారికి కుంకుమార్చన జరిపించుకున్నారు. అమ్మవారి ఆలయం వద్ద గల ఆశీర్వచన మండపంలో వారికి వేదపండితులు, అర్చకులు వేదాశీర్వచనం చేశారు. దేవస్థానం అధికారులు స్వామి వారి శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేసి సత్కరించారు.

రైతులకు సాగునీరు అందించేలా చర్యలు


చెరువు వద్ద ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి

వెలుగోడు: పెద్ద మల్లాలమ్మ చెరువు కింద రైతులకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటానని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. అటవీప్రాంతంలో ఉన్న పెద్ద మల్లాలమ్మ చెరువు నుంచి నీటి విడుదలను అటవీ శాఖ అధికారులు నిలిపివేశారు. దీంతో రైతులు శనివారం ఎమ్మెల్యేను ఆశ్రయించడంతో ఆయన చెరువును పరిశీలించి అటవీశాఖ అధికారులతో మాట్లాడారు. రైతులను ఆదుకునే విధంగా అటవీ శాఖ మంత్రితో చర్చిస్తానని హామీ ఇచ్చారు. నాయకులు అన్నారపు శేషిరెడ్డి, మండ్ల శంకర్‌రెడ్డి, ఖలీలుల్లాఖాన్, తెలుగు రమణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివద్ధికి ప్రాధాన్యత

మహానంది: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి తెలిపారు. కొరటమద్ది నుంచి బండిఆత్మకూరు వరకు (యరగ్రుంట్ల మీదుగా) రూ. 3.72 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణానికి శనివారం భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీలను తప్పకుండా నెరవేరుస్తామని అన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీశైలం ట్రస్ట్ బోర్డు మాజీ మెంబర్ డాక్టర్ చిట్టిబొట్ల భరద్వాజ శర్మ, రమణారెడ్డి, నందిపాటి నరసింహ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేలాల్లో పెరిగిన ఆదాయం


వేలాలు నిర్వహిస్తున్న అధికారులు

మహానంది: బండిఆత్మకూరు మండలం అయ్యవారి కోడూరు గ్రామంలో కొలువైన శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయానికి చెందిన 38.31 ఎకరాల భూములకు శనివారం నిర్వహించిన బహిరంగ వేలం పాటలో రూ. 9,66,000 ఆదాయం వచ్చినట్లు ఈఓ నాగప్రసాద్ తెలిపారు. గతేడాది రూ.7,80,500 వచ్చిందని, గతేడాది కంటే రూ.1,85,500 అదనంగా ఆదాయం వచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో గ్రూపు దేవాలయాల ఇన్‌స్పెక్టర్ శశికుమార్, రైతులు పాల్గొన్నారు.